క్లుప్తంగా

అనుమతులు లేకుండా అమ్మితే చర్యలు

నింద్ర: మండలంలో అనుమతులు లేకుండా టపాకాయలు అమ్మితే వారిపై చర్యలు తప్పవని నింద్ర ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లైసెన్సు పొందిన వ్యక్తులు మాత్రమే వారికి అనుమతించిన స్థలంలో టపాకాయలు విక్రయించాలని సూచించారు. గ్రామాల్లో దొంగచాటున విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మోటార్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామ పంచాయతీలోని వైఎస్సార్ కాలనీలో తాగునీటి మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ వసంతమ్మ తెలిపారు. గత కొద్ది రోజులుగా మోటార్ మరమ్మతులకు గురి కావడంతో ఇబ్బంది ఏర్పడింది. అయితే శనివారం మోటార్ ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్

పాలసముద్రం: పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశ పెడుతోందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్, డీఎంజీ శంభర్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ఫరీద్ మస్తాన్ సమక్షంలో సీసీ, సంఘమిత్ర, వీవో లీడర్లకు సమీక్ష జరిగింది. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్ మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగతంగా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.1.50 లక్షలు వరకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళలు రుణాలను తీసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని సూచించారు. డ్వాక్రా గ్రూప్‌లో తీసుకున్న రుణాలు, అప్పులను కొత్త వెబ్‌సైట్‌లో నమోదు చేసే విధానంపై వరించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, శోభ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం ఉదయం జరిగిన పెద్దశేష వాహన సేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఆచార్య సర్వోత్తమ రావు రచించిన శ్రీ తాళ్లపాక పదకవుల సంకీర్తనలు, డాక్టర్ గిరిధర్ బోరె రచించిన భగవద్గీత, కొలిచిన అద్వైత పరబ్రహ్మ శాస్త్రి రచించిన శ్రీవిద్యా విలాసం పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా.ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు డా.నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు శివసుబ్రమణ్యం ఆకస్మిక మృతి



శివసుబ్రమణ్యం (ఫైల్)

తిరుపతి కల్చరల్: రంగస్థల నటుడు శివసుబ్రమణ్యం(73) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన రైల్వే మెయిల్ ఎక్స్‌ప్రెస్ గార్డ్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం రాయల్ నగర్‌లో నివాసముంటున్న ఈయన రైల్వే గార్డ్‌గా మదనపల్లె, పాకాల, తిరుపతిలో పని చేసి ఇక్కడే పదవీ విరమణ పొందారు. అటు వృత్తిలో రాణిస్తూ ప్రవృత్తిగా నాటక రంగాన్ని ఎంచుకొని భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి ఏకపాత్రాభినయాలతోపాటు అనేక వేషాలు ధరించి అద్భుత నటనతో ప్రేక్షకుల ఆదరణ పొందారు. రావణ బ్రహ్మ పాత్రలో అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి పేరు తెచ్చుకోవడంతోపాటు అవార్డును అందుకున్నారు. నవ్య కళాసమితి స్థాపించి రైల్వే కళాకారులను మరింత ప్రోత్సహించి తద్వారా అనేక నాటకాలు ప్రదర్శింపజేశారు. రంగస్థల నటుడుగా ఆయన ఎనలేని అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శివసుబ్రమణ్యం అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు మహేష్‌బాబు తెలిపారు. వీరి మృతిపై పలువురు కళాకారులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

కొత్త వెలుగులు నింపే దీపావళి

- పట్టణాలు, గ్రామాల్లో పండుగ శోభ
- ప్రారంభమైన టపాకాయల అమ్మకాలు



నగరి: టపాకాయల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి





నగరిలో రద్దీగా దుకాణాలు, శ్రీరంగరాజపురంలో నిబంధనలను పాటించని దుకాణాదారులు

నగరి: దీపావళి పండుగ వచ్చేసింది. సంప్రదాయ పండుగల్లో ఒక్కటైన దీపావళి కేవలం హిందువులే కాకుండా అందరూ ఆనందంగా పండుగ జరుపుకుంటారు. నియోజకవర్గంలోని నగరి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పండుగ శోభ సంతరించుకుంది. నగరి పట్టణానికి దూరంగా కుశస్థలి నది సమీపంలోని మైదానంలో 7 టపాకాయల విక్రయ దుకాణాలు, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 6, వడమాలపేట మండంలోని ఎస్‌ఆర్‌టీ కళ్యాణ మండపం సమీపంలో 2 దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాల మధ్య దూరం పాటించాలని, శానిటైజర్లకు మండే స్వభావం ఉండడంతో దుకాణాల వద్ద ఎవరూ వాటిని దగ్గరలో ఉంచుకోకూడదని, మాస్కులు ధరించి వచ్చి కొనుగోళ్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి..

దుకాణారులు అగ్నిమాపక నిబంధనలను పాటించాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు సూచించారు. టపాకాయలు విక్రయించే దుకాణాలు ఆస్‌బెస్టాస్, జింక్ షీట్లతో గానీ, మండడానికి దోహదం చేయని వస్తువులతో, షాపును 9 చదరపు మీటర్ల పరిధిలో ఏర్పాటు చేయాలని, షాపుల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని దుకాణదారులకు సూచించారు. ప్రతి షాపు దగ్గర మంటలు ఆర్పే 5 కేజీల సామర్థ్యం ఉన్న ఎక్స్‌టింగ్విషర్స్, రెండు డ్రమ్ములు ఉంచి 200 లీటర్ల నీరు పెట్టాలని నాలుగు బకెట్లు ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. నో స్మోకింగ్ బోర్డు విధిగా పెట్టాలని ఆదేశించారు. నగరి నియోజకవర్గం దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగరి అగ్నిమాపక శాఖ అధికారి డి.సుబ్బరాజు తెలిపారు. పిల్లలు టపకాయలును పెద్దల సమక్షంలోనే కాల్చాలని ఇంటి బయట లేదా బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే కాల్చాలని కోరారు. టపాకాయలను కాల్చేటప్పుడు బిగువైన నూలు దుస్తులనే ధరించాలని ఒంటికి దుస్తులకు దూరంగా ఉంచాలని కోరారు. టపాసులను గట్టి నేలపై ఉంచి కాల్చాలని, గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బ్యాంకులకు దూరంగా కాల్చాలని నిబంధన పెట్టారు. బాణసంచా కాల్చేటప్పుడు తలను తిప్పి ఉంచాలని ఆ గాఢ వాయువును పీల్చకుండా ఉండడానికి నిల్చొని ఉండాలని కోరారు. దురదృష్టవశాత్తు నిప్పురవ్వలు దుస్తులపై పడి అంటుకున్నట్టైతే నేలపై దొర్లాలన్నారు. టపాకాయలు కాల్చే సమయంలో వంటగది కిటికీలను, తలుపులను మూసి ఉంచాలన్నారు. ప్రమాద నివారణ కోసం ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. చేతితో పట్టుకుని టపాకాయలు కాల్చరాదన్నారు. సగం కాలిన టపాకాయలను నిర్లక్ష్యంగా వదిలి వేయరాదన్నారు. టపాకాయలు కాల్చేసమయంలో దగ్గర్లో నీళ్ల ఉంచుకోవాలని, ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు వైర్లు వద్ద కల్చకూడదని అన్నారు. దురదృష్టవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే అగ్ని మాపక సిబ్బందికి 9963737024, 08677236122 నంబర్లకు కాల్ చేసి తెలియపరచాలన్నారు.

నిబంధనలు బేఖాతరు

శ్రీరంగరాజపురం: మండలంలోని కొందరు టపాకాయల వ్యాపారులు కనీస ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. జాతీయ రహదారికి ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక, గ్యాస్ వంటి రక్షణ వస్తువులను తదితర వాటిని కూడా అందుబాటులో ఉంచలేదు. మూడు రోజులు సెలవులు రావడంతో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అధిక మోతాదులో టపాకాయలను నిల్వ చేసి, వ్యాపారులు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే టపాసులను అమ్మకాలు చేస్తున్నాడు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానిక సర్పంచ్ గిరిబాబు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి టపాకాయల వ్యాపారుల ఆగడాలను అడ్డుకోవాలని కోరుతున్నారు.

పుత్తూరులో దీపావళి సందడి

పుత్తూరు: పట్టణంలో దీపావళి సందడి నెలకొంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని టపాసుల అంగళ్లతో పాటు, దుస్తులు, బంగారు దుకాణాలు కొనుగోళ్లదారులతో కళకళలాడుతున్నాయి. నోముల సామగ్రి అంగళ్లు కిక్కిరిశాయి. ఆదివారం నరక చతుర్థి దీపావళి, సోమవారం నోములను నోచుకోనున్నారు. శనివారం నుంచే టపాసుల మోతతో పుత్తూరు పట్టణం దద్దరిల్లింది. పలు అంగళ్లు విద్యుత్ దీపాలతో చూపరులను ఆకట్టుకున్నాయి.



పుత్తూరు: టపాకాయల అంగళ్ల వద్ద కొనుగోళ్ల సందడి



మెగా ఊదొత్తుల అమ్మకాల జోరు

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

- పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాల అమలు
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకుందాం
- మంత్రి ఆర్‌కే రోజా పిలుపు



విద్యార్థినికి కెరీర్‌పై సూచనలు ఇస్తున్న మంత్రి

పుత్తూరు: సంక్షేమ సారథిగా ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖల మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. వడమాలపేట మండలం అప్పలాయగుంట సచివాలయ పరిధిలోని వడ్డిండ్లలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర చేసిన మంత్రి రోజా శనివారం ఉదయం పత్తిపుత్తూరు, వడ్డిండ్లులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా మీ కుటుంబాని వర్తించిందా ? అంటూ ప్రశ్నించారు. అందరూ అన్నీ అందుతున్నాయని ఆనందంగా సమాధానం చెప్పారు.

గతంలో జన్మభూమి కమిటీలదే పెత్తనం

ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే పథకాలు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రం కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎవరికైనా అర్హులైన వారు తమకు పలానా పథకం అందలేదని సచివాలయంలో అర్జీ ఇచ్చినా, తమ దృష్టికి తీసుకొచ్చినా వెంటనే లబ్ధి చేకూరేలా చొరవ చూపుతామని స్పష్టం చేశారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని ఆరోపించారు. సీఎం జగనన్న నాలుగున్నరేళ్లలోనే అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టమని అభివర్ణించారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మీరు సిద్ధమా అంటూ మంత్రి అక్కడే ఉన్న మహిళలను ప్రశ్నించారు. దీనికి తామూ సిద్ధం అంటూ ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఇలా గ్రామాలకు గ్రామాలు ఒక్కతాటిపై నిలబడి అభివృద్ధిని, సంక్షేమాన్ని మరింత సాధించుకోవాలని సూచించారు. స్థానికంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, వడమాలపేట మండల పార్టీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, శాఫ్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, డీఎల్ఎస్‌సీ మెంబర్ కిరణ్‌కుమార్, సోషల్‌మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ శేషాద్రిరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి, పార్టీ నాయకులు బాబు, అయ్యప్పరెడ్డి, కమలమ్మ పాల్గొన్నారు.

పేదల మనసులో సీఎం జగన్ పదిలం



మాట్లాడుతున్న కన్వీనర్ తులసీరామ్ యాదవ్

పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల మనసుల్లో పదిలంగా ఉన్నారని మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ అన్నారు. శనివారం వెంగళరాజుకుప్పం దళితవాడలో «ఏపీకి జగనే ఎందుకు కావాలి» కార్యక్రమం సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ అయ్యప్ప, పుత్తూరు కేశవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వేణు, షణ్ముగరెడ్డి, వైస్ సర్పంచ్ సుమన్, గురుప్రసాద్, గోపాల్, రవిరెడ్డి, ప్రకాష్, ఆనందన్, ధనుంజయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మొదటి, ద్వితీయ బహుమతులు అందుకుంటున్న విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలసముద్రం: జిల్లాల్లో జరిగిన క్విజ్ పోటీల్లో తిరుమలరాజుపురం హైస్కూల్ విద్యార్థి అభినయ మొదటి బహుమతి, అవార్డు తీసుకుని ప్రతిభ చాటిందని హెచ్‌ఎం ధీనదయాలు రెడ్డి శనివారం తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఎయిడ్స్, కేన్సర్, టీబీపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి జిల్లాలో మొదటి స్థాయిలో వచ్చింది. రెండవ స్థానంలో పావని వచ్చారు. వీరికి మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థి అభినయకు రూ.5000, రెండవ స్థానంలో వచ్చిన విద్యార్థిని పావని రూ.2500, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నగదు తీసుకుని అవార్డు తీసుకున్నారని తెలిపారు. మొదటి స్థానంలో వచ్చిన అభినయ రాష్ట్రస్థాయిలో జరుగునున్న పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్విజ్ పోటీల్లో కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు అభినందించారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసు, శ్రీనివాసులు, ఉష, సలీమ, సుధాకర్ పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయింపు



మంత్రి రోజాను సన్మానిస్తున్న వన్నెకుల క్షత్రియ సంఘ నేతలు

పుత్తూరు: పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ పరిధిలో వెన్నెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కల్యాణ మండపం, వృద్ధాశ్రమం, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఇందుకు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వినతిమేరకు సర్వే నంబర్ 210/2లో 1.04 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం మంత్రి కార్యాలయంలో నగరి నియోజకవర్గ వన్నెకుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు ఎ.ఎస్.వెంకటేశన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి రోజా, ఆమె సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మురళీరెడ్డి, మనోహర్‌రెడ్డి, కన్నన్, మునస్వామిరెడ్డి, జయరామన్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రవిచంద్రన్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు పూర్ణాహుతి



శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

14న డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ప్రభుత్వం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు నేతృత్వంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలిపిరి డిపో పరిధిలో సమస్యలు ఉంటే 99592 25671 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శిగా కృపావరమ్మ



కృపావరమ్మను సన్మానిస్తున్న సంఘ నేతలు

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఏపీజీఆర్ఈఏ) రాష్ట్ర కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కృపావరమ్మ ఎంపిక కావడం ఆమె సేవా తత్పరతకు దక్కిన గౌరవంగా స్థానిక సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో కృపావరమ్మ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా సేవలందించిన ఆమె రిటైర్డ్ అయిన తర్వాత తన సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారని కొనియాడారు. ఆమె సేవలను గుర్తించి జిల్లాసంఘం కార్యదర్శిగా ఎంపిక చేయగా, ఇప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడం ఆమె సేవా తత్పరతకు నిదర్శనమన్నారు. ఆమె భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువలు, పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, రామలింగం, కృష్ణమనాయుడు, సుబ్రమణ్యం, అరుణాచలం, కుప్పయ్య, నిర్మలమ్మ, లలిత, సుశీల, రామూర్తి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దొంగలతో జాగ్రత్త

- జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: నగరంలో దొంగలు వివిధ కోణాలు వెతుక్కుని దొంగతనాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన దొంగతనాల విధానాలను వివరించారు.

- నాలుగో తేదీన అనంత వీధిలో ఓ వృద్ధురాలు ఒక్కరే ఇంటి తలుపులు తెరుచుకొని టీవీ చూస్తూవుంది. ఇదే సమయంలో ఇద్దరు ఆగంతకులు ఇంటి లోపలికి ప్రవేశించి నోరు మూసి ఒంటిపై ఉన్న బంగారు గాజులు, చైన్, ఉంగరాలు దొంగలించి, ఆమెను రూములో బంధించి పారిపోయారు.
- అదేవిధంగా ఈ నెల ఏడో తేదీన రాత్రి 7 గంటల సమయంలో ఓటేరులో కాపురం ఉంటున్న ఓ మహిళ తన ఇంట్లో చిన్నపిల్లలను ఉంచి ఇంటి తలుపులు తెరిచి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లింది. అదే సమయంలో ఇద్దరు యువకులు ఇంటి వద్దకు వచ్చి చదువుకుంటున్న చిన్నపిల్లలతో మీకు మేం చదువు చెప్తామని, కావాలంటే స్కూల్ బ్యాగులు తెస్తామని వారితో చనువుగా ప్రవర్తించారు. ఆ పిల్లలు నమ్మించి మొహం కడుక్కోవడానికి బాత్రూం చూపించమని అడిగారు. అలా రూమ్ లోకి వెళ్లడంతో బీరువాకు తాళం ఉండడంతో అందులో ఉన్న 500 గ్రాములు బంగారం దోచుకుని పారిపోయారన్నారు. ఇలా జరుగుతున్న దొంగతనాలకు అరికట్టేందుకు ప్రజల సహకారం కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఊరికి వెళ్లే సమయంలో సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లో సమాచారం అందిస్తే ఎల్‌హెచ్ఎంఎస్(కెమెరాలను)ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా దీపావళి జరుపుకోవాలి

దీపావళి సందర్భంగా తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. దీపావళి పండుగను ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో ఇసుక, నీళ్లను తప్పనిసరిగా పక్కనే ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే 100కు సమాచారం అందించాలన్నారు.